అస్తవ్యస్తంగా మార్కెట్

- ప్రజలు నడవడానికి వీల్లేకుండా ఆక్రమించుకున్న వ్యాపారులు
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని దిన కూరగాయల మార్కెట్ అస్తవ్యస్తంగా తయారైంది. మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో వ్యాపారులు ఇష్టానుసారం ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఒకప్పుడు విశాలంగా ఉన్న కూరగాయల మార్కెట్ లోపలి భాగం నేడు వ్యాపారుల ఆక్రమణలతో కుంచించుకుపోయింది. కూరగాయలను కొనుగోలు చేయడానికి వచ్చేవారు నడవడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. ఇరువైపులా ఉన్న వ్యాపారులకు చెందిన కూరగాయల బస్తాలు, రాసులను దాటుకుని వెళ్లడానికి మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మార్కెట్‌లో రద్దీగా ఉంటోంది. ఇలాంటి సమయాల్లో ఒకరిని ఒకరు తోసుకొని వెళ్లే పరిస్థితి ఉంటోంది. దీన్ని అవకాశంగా చేసుకున్న దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఎక్కువగా సెల్‌ఫోన్‌లను దొంగించుకుపోతున్నారు. రద్దీ ఎక్కువ ఉండటంతో తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లను వెంటనే గమనించడం లేదు. అలస్యంగా గుర్తించిన ప్రజలు సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారంటూ గగ్గోలు పెడుతున్నారు. సెల్‌ఫోన్ల దొంగతనాలపై పోలీసులు కేసు నమోదు చేయడానికి నిరాకరిస్తుండటంతో ప్రజలు మిన్నుకుంటిపోతున్నారు.


తాడిపత్రిలోని కూరగాయల మార్కెట్


కుంచించుకుపోయిన మార్కెట్ లోపలి ప్రదేశం

2004లో ఆధునిక వసతులతో మార్కెట్ నిర్మాణం

2004లో సీబీ రోడ్డులోని ఫైర్‌శాఖకు చెందిన రెండు ఎకరాల స్థలాన్ని మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకుని ఆధునిక వసతులతో దిన కూరగాయల మార్కెట్‌ను నిర్మించారు. పట్టణంలోని చిన్న బజారులో ఉన్న మార్కెట్‌ను ఇక్కడికి తరలించారు. అప్పట్లో వ్యాపారులకు వివిధ రకాల రాయితీలకు మునిసిపల్ అధికారులు ప్రకటించారు.

మూడు జిల్లాల కేంద్రంగా దిన కూరగాయల మార్కెట్

తాడిపత్రి దిన కూరగాయాల మార్కెట్ మూడు జిల్లాల కేంద్రంగా ఉంటోంది. ఆయా జిల్లాల సరిహద్దుల నుంచి పలురకాల కూరగాయాలు మార్కెట్‌కు వస్తున్నాయి. తాడిపత్రి పట్టణ పరిసర ప్రాంతాల్లో విస్తరించిన భారీ పరిశ్రమలతో పాటు గ్రానైట్, కడప స్లాబ్ యునిట్లలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలకు చెందిన వారి రాకపోకలతో కూరగాయాల మార్కెట్ కిటకిటలాడుతూ ఉంటోంది. పండుగల సమయంలో కొనుగోలుదారులతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది.

గంప, చిరు వ్యాపారులపై మార్కెట్ లోపలి వ్యాపారుల హుకుం

దిన కూరగాయాల మార్కెట్‌కు ముందు భాగంలో ఇరువైపులా వ్యాపారం చేస్తున్న గంప, చిరు వ్యాపారులపై కొందరు వ్యాపారులు హుకుం ప్రదర్శిస్తున్నారు. మార్కెట్ లోపల విక్రయించే కొన్ని రకాల కూరగాయలు, ఇతర కాయలను గంప, చిరు వ్యాపారులు విక్రయించరాదని హెచ్చరిస్తున్నారు. కొందరు నాయకుల పేర్లు చెప్పి చిరు వ్యాపారులను భయపెడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ, ఉక్కపోత భరించి వ్యాపారం చేసినా ఆ పూట ఇంటిల్లిపాదీ తినడానికి కూడా కష్టమవుతున్న పరిస్థితుల్లో వ్యాపారంపై అడ్డంకులు చెప్పడం వారిని కృంగదీస్తోంది.

చర్యలు తీసుకుంటాం



గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆక్రమించిన వ్యాపారులకు నోటీసులు ఇచ్చాం. ఇకపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే మరోసారి నోటీసులు ఇచ్చి లైసెన్సులను రద్దు చేసి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తాం. వ్యాపారులు అక్రమణల కారణంగా ఈవ్ టీజింగ్, సెల్‌ఫోన్ల దొంగతనాలు ఎక్కువ జరుగుతున్నాయన్నాయని ఫిర్యాదులు అందుతున్నాయి.

– శివరామక్రిష్ణ, కమిషనర్

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నేడు ముస్లిం జేఏసీ ర్యాలీ


మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ మద్దతు కోరుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

గుంతకల్లుటౌన్: వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఉదయం గుంతకల్లు ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ ర్యాలీకి మద్దతివ్వాలని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం వైవీఆర్‌ను ఆయన నివాసంలో జేఏసీ నాయకులు కలిసి మద్దతు కోరారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని లోక్‌సభ, రాజ్యసభల్లో వ్యతిరేకించడమే కాకుండా అత్యున్నత న్యాయస్థానాన్ని తమ పార్టీ ఆశ్రయించిందని వైవీఆర్ వారికి గుర్తు చేశారు. ముస్లిం జేఏసీ నిర్వహించనున్న ర్యాలీకి ఎమ్మెల్యే సంపూర్ణ మద్దతు తెలిపినట్లు మైనార్టీ నేతలు తెలిపారు. వైవీఆర్‌ను కలిసిన వారిలో జేఏసీ నాయకులు, మతపెద్దలు ఉన్నారు.

ఆలయ భూముల కౌలుకు నేడు వేలం

పామిడి: మండలంలోని వంకరాజుకాలువలో ఆంజనేయ, భైరవస్వాముల దేవదాయ భూములకు శనివారం కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఏ క్రిష్ణయ్య శుక్రవారం తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందన్నారు. మూడు సంవత్సరాలకు సంబంధించి నిర్వహించే వేలంలో పాల్గొనదలచిన వారు రూ.500 డిపాజిట్ చేయాలన్నారు. ఆసక్తి ఉన్న వారు 9441012561 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

నెట్టికంటుడి నివేదనకు హైదరాబాద్ కూరగాయలు


వ్యాపారులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న ఆలయ సిబ్బంది

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి సమర్పించే నివేదనలు, అన్నదానానికి అవసరమైన కూరగాయలను ఉచితంగా అందించడానికి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్కెట్ వ్యాపారులు అంగీకరించినట్లు ఈఓ కేవాణి తెలిపారు. ఈఓ ఆదేశాల మేరకు దాతల నుంచి విరాళాలు స్వీకరించే క్రమంలో భాగంగా శుక్రవారం ఏఈఓ వెంకటేశ్వరుడు, అర్చకుడు చక్రవర్తి, చరణ్ తదితరులు హైదరాబాదులో పర్యటించారు. ఎల్బీనగర్‌లో ఎన్టీఆర్ మార్కెట్ వ్యాపారులను కలిసి ఆలయ నిత్యాన్నదాన సత్రానికి, స్వామివారి నివేదనలకు అవసరమైన కూరగాయలను ఉచితంగా అందజేయవలసిందిగా కోరగా వారు అంగీకరించినట్లు ఈఓ తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారులకు ఆలయ సిబ్బంది స్వామివారి ఫొటో, తీర్థప్రసాదాలను అందజేశారు.

29న మహనీయుల జయంత్యుత్సవం


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాల సందర్భంగా బీఎస్పీ ఆధ్వర్యంలో ఈ నెల 29న గుంతకల్లులో నిర్వహించనున్న భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాసరాజు, రాష్ట్ర రజక సంఘం నేత దేవేంద్రప్ప కోరారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ సభకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఆ మహనీయుల సిద్ధాంతాలు, ఆశయాలను తెలియజేయడమే సభ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, వాల్మీకి నాయకుడు మాచర్ల ఎల్లప్ప, కౌన్సిలర్ సుధాకర్, కేజీఎస్ అధ్యక్షుడు మాలిక్‌సాబ్, వివిధ కుల సంఘాల నాయకులు గిడ్డయ్య, తిమ్మప్ప, పుష్పాంజలి, విజయ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు


నవోదయం 2.0 కరపత్రికను ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ సీఐ గద్దం నాయుడు, ఎస్‌ఐ, గ్రామస్తులు

తాడిపత్రి: మండలంలోని గదరగుట్టపల్లిలో ఎక్సైజ్ అధికారులు నవోదయం 2.0 పై ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఎక్సైజ్ సీఐ గద్దం నాయుడు, ఎస్‌ఐ ఆంజనేయులు మాట్లాడుతూ నాటు సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నాటు సారా తయారీ, విక్రయాలు అరికట్టడంలో భాగంగానే నవోదయం 2.0 కు శ్రీకారం చుట్టిందని, సారా రహిత మండలంగా తాడిపత్రిని ఉంచడంలో భాగంగా ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం నవోదయం 2.0 కరపత్రికను గ్రామస్తులతో కలసి వారు ఆవిష్కరించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


నీటి తొట్టెను పరిశీలిస్తున్న అధికారులు

యాడికి: ప్రతిఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలోని నంబర్ 2 సచివాలయంలో గురువారం డ్రై డే ఫ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగు నిల్వ ఉంటే దోమలు విజృంభించి మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఇళ్లలోని చెత్తను చెత్త సేకరించే బండిలో వేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మర్ స్కేటింగ్ క్యాంప్ ప్రారంభం

గుత్తి: గుత్తిలో శుక్రవారం సమ్మర్ స్కేటింగ్ క్యాంప్ ప్రారంభమైంది. మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్ గుప్తా స్కేటింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోచ్ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి మే 6వ తేదీ వరకూ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల పిల్లలు క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డికి ఘన నివాళి


సూరీడు సమాధి వద్ద నివాలర్పిస్తున్న తాడిపత్రి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వెంకట్రామిరెడ్డి

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లిలో శుక్రవారం ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి 20వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సూరీడు భార్య కళావతమ్మ, తాడిపత్రి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, యువ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే తమ్ముడు కృష్ణారెడ్డి, సూరీడు, పెద్దారెడ్డి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కులమతాల మధ్య చిచ్చుపెడుతున్న 'ఎన్‌డీఏ'


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గుత్తి: ఎన్డీఏ ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చుపెడుతోందని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ, మండల కార్యదర్శులు రాందాసు, రాజు ఆరోపించారు. గుత్తిలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం వారు విలేఖరులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా ఏదో ఒక సమస్యను తెరపైకి తీసుకురావడం పబ్బం గడుపుకోవడం పరిపాటిగా మారిందన్నారు. తలాక్, ఆర్టికల్ 370, అయోధ్య రామ మందిరం వంటి సున్నిత అంశాలను తెరపైకి తీసుకురావడం దారుణమన్నారు. రైతులు, నిరుద్యోగులు, విద్యారంగ సమస్యలను గాలికొదిలేసిందన్నారు. ఎన్డీఏపై జనాల్లో పూర్తి వ్యతిరేకత వచ్చిందన్నారు. 2029లో ఎన్డీఏ కూటమి పార్టీలను ప్రజలు ఇంటికి పంపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నియోజకవర్గం కార్యదర్శి మహమూదా, సీపీఐ సీనియర్ నాయకులు నజీర్, వెంకటరాముడు, షఫి, మాబ్బి, నూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పుట్లూరు: మండలంలోని బాలాపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దయ్య, పెద్దిరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలకు 10 వారాలుగా వేతనాలు అందించకపోవడం దారుణమన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఆధ్వర్యంలో బండ్లపల్లి నుంచి అనంతపురం వరకు ఈ నెల 21, 22వ తేదీలలో చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పాదయాత్ర కరపత్రాలను కూలీలకు అందజేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

తాడిపత్రిటౌన్: పెద్దపప్పూరు మండలం జూటూరులో హెచ్‌ఎంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన చంద్రశేఖర్ దంపతులను శుక్రవారం ఉద్యోగఉపాధ్యాయ సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు వారిని శాలువాలతో పూలహారాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గురప్ప, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, గౌరవాధ్యక్షుడు శ్రీహరి, కన్వీనర్ నారబోయిన శంకర్, గౌరవ సలహాదారుడు చెన్నకేశవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


డాక్టర్ విష్ణుమూర్తి

పుట్లూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ విష్ణుమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉండగా డాక్టర్ హిమబిందు వైద్య వృత్తిలో పీజీ చేయడానికి వెళ్లడంతో ఆమె స్థానంలో డాక్టర్ విష్ణుమూర్తి నియామకమయ్యారు.

బీకేఎస్ సీఐగా పుల్లయ్య



బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం సీఐగా పుల్లయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న కరుణాకర్ తిరుపతి జిల్లాకు బదిలీపై వెళ్లారు. వైఎస్సార్ జిల్లాలో సీఐగా పని చేస్తున్న పుల్లయ్య బీకేఎస్ మండల సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ పుల్లయ్య మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. జాతీయ రహదారులపైప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే


గుంతకల్లులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఆర్‌సీఎం చర్చి పాస్టర్ ప్రతాప్‌రెడ్డి



గార్లదిన్నె మండలం మర్తాడులోని మిస్పా గ్రేస్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం


యాడికి అగాపే ప్రార్థన మందిరంలో వేడుకలు నిర్వహిస్తున్న పాస్టర్ బత్తుల ప్రసాద్

గుంతకల్లుటౌన్/గుత్తి/పామిడి/తాడిపత్రి రూరల్/యాడికి/గార్లదిన్నె/పెద్దవడుగూరు: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుంతకల్లు పట్టణంలోని ఆర్‌సీఎం, సీఎస్‌ఐ, ఎస్‌పీజీ, బెయేర్షబా తదితర చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాస్టర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే త్యాగానికి ప్రతీక అన్నారు. క్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు.

- గుత్తిలోని సీఎస్‌ఐ చర్చి, ఆర్‌ఎస్‌లోని బైబిల్ మిషన్ చర్చి, హోరబ్ చర్చి, రెడ్ చర్చి, సెయింట్ చర్చి, సీఎస్‌ఐ చర్చిలల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. పాస్టర్లు వరప్రసాద్(హైదరాబాద్), అద్భుత కుమార్, డేవిడ్ నాయక్, వైపీ బాబు, వాసు అనిల్ కాంత్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు
- పామిడి మండలంలోని అన్ని చర్చీల్లో గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీఎస్‌ఐ చర్చీలో దైవదాసులు పీపీఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధనలో వక్తలు ప్రసంగించారు. అనంతరం పోస్టల్ సుశీలమ్మ, దేవదాసు కుటుంబం సౌజన్యంతో 300 మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. టీచర్ కరుణాకర్, స్త్రీల మైత్రి ఆధ్వర్యంలో సంఘం అంతటికీ మజ్జిగ పంపిణీచేశారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.
- తాడిపత్రి పట్టణంలోని సుంకుళమ్మ పాలెం సీఎస్‌ఐ చర్చి నుంచి నంద్యాలరోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, సీబీ రోడ్డు మీదుగా నందలపాడులోని రైల్వే స్టేషన్ వద్ద గల చర్చి వద్దకు జీసస్ ఫర్ రన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున క్రైస్తవులు హాజరయ్యారు. అంతకు మునుపు పట్టణంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- యాడికి మండల కేంద్రంలోని అగాపే ప్రార్థన మందిరంలో పాస్టర్ బత్తుల ప్రసాద్, సీఎస్‌ఐ చర్చిలో జయరాజు బాబు గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు.
- గార్లదిన్నె మండలంలోని గార్లదిన్నె, యర్రగుంట్ల,తిమ్మంపేట, పెనక చెర్ల డ్యాం, పెనకచెర్ల, కేశవాపురం,ముకుందాపురం మర్తాడు చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. అలాగే మర్తాడు మిస్పాగ్రేస్ చర్చిలో పాస్టర్ సయ్యద్ వలి క్రీస్తు సందేశాన్ని వినిపించారు.
- పెద్దవడుగూరు మండలంలోని పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, దిమ్మగుడి, రావులుడికి, క్రిష్టిపాడు, గుత్తిఅనంతపురం తదితర గ్రామాల్లోని చర్చిలల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. పాస్టర్ జాన్‌డేవిడ్, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో ప్రార్థనలు చేస్తున్న హైదరాబాద్ పాస్టర్ వర ప్రసాద్


పామిడిలోని సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

సంక్షిప్త సమాచారం

పండ్ల తోటల సాగుకు 40 శాతం రాయితీ

తాడిపత్రి: పండ్ల తోటల విస్తీర్ణం పెంచేందుకు ఉద్యాన రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీ అందిస్తోందని తాడిపత్రి ఉద్యానవన అధికారిణి ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చీనీ, దానిమ్మ, బొప్పాయి, అల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్, పూల తోటలకు రాయితీ ఇస్తామన్నారు. నీటి కుంటల తవ్వకం ద్వారా పండ్ల తోటలకు రక్షక తడులను అందించేందుకు ఒక్క యూనిట్ మేర 1200 క్యూబిక్ మీటర్లు చొప్పున తవ్వుకున్న రైతులకు 50 శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే దానిమ్మ తోటలో మందు పిచికారీ చేయడానికి అవసరమయ్యే తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లను 40 శాతం రాయితీ ఉంటుందన్నారు. పక్షుల బెడద నుంచి దానిమ్మ పంటను రక్షించుకోవడానికి యాంటీ బర్డ్ నెట్ పథకం ద్వారా 40 శాతం రాయితీ అందిస్తుందన్నారు. అర్హులైన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం సబ్సిడీ నగదు జమ చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పరామర్శ

పామిడి: మండలంలోని పీ కొండాపురంలో రోడ్డు ప్రమాద బాధితుడు నరసింహను శుక్రవారం వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ పట్టణ కన్వీనర్ చీమల నగేష్, బోయ సుధాకర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, భరోసా నిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు, బోయ రమణ, రాజు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించండి

యాడికి: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ మండల కన్వీనర్ వడ్డే రాజశేఖర్ కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కాయన మాట్లాడుతూ బెంగాల్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నాయన్నారు. అక్కడ శాంతి భద్రతలు క్షీణిస్తున్నా సీఎం మమతా బెనర్జీ పట్టించుకోలేదన్నారు. హిందువులపై దాడులు జరగకుండా బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా సెక్రటరీ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని కంపచెట్లలో గత కొన్ని రోజులుగా కొందరు పేకాట ఆడుతున్నారు. అందిన సమాచారంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఆశాబేగం, సిబ్బంది పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.17 వేల నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఏఎస్‌ఐ రామాంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ హనుమంతు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని పెద్దెక్కలూరు గ్రామ శివార్లలో కాళికాదేవి ఆలయం వద్ద శుక్రవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పేకాట స్థావరంపై దాడి చేయగా తొమ్మిది మంది పేకాటు ఆడుతుండగా ముగ్గురు వ్యక్తులు పారిపోగా ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. వారి నుంచి 16,050 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఎనిమిది మోటర్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

మోడువారుతున్న పచ్చదనం


సీబీరోడ్డు మార్కండేయస్వామి ఆలయం పక్కన చెట్లను కొట్టివేసిన దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలో కొందరు స్వార్థపరులు చెట్లు నరికివేస్తుండటంతో పచ్చదనం మోడువారుతోంది. దుకాణాలకు అడ్డుగా ఉందని.. ఇంటిపైకి కొమ్మలు వచ్చి ఇబ్బంది పెడుతున్నాయని, విద్యుత్ తీగలుపై కొమ్మలు పడి తెగిపోతున్నాయని చెట్లను ఇష్టారాజ్యంగా నరికేస్తున్నారు. కొన్నిచోట్ల చెట్లకు రక్షణ లేక పోవడంతో గాలివానకు రోడ్లపైనే కూలిపోతున్నాయి. ఇలానే కొనసాగితే పట్టణం పచ్చదనం మోడువారక తప్పదని, అధికారులు స్పందించి చెట్లను సంరక్షించాలని పట్టణవాసులు కోరుతున్నారు.


సంజీవనగర్‌లో చెట్టును కొట్టివేసిన దృశ్యం